క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కర్రి తోడపెద్దు పెదకర్మ



తోడపెద్దు నంది విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న బొడ్డేడ ప్రసాద్, తదితరులు

మునగపాక: మునగపాకలో శనివారం జగ్గప్పగారి కర్రి తోడపెద్దు పెదకర్మను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల కర్రి తోడపెద్దు అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం నందీశ్వర కళా ప్రాంగణంలో ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పాత తోడపెద్దు నంది విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మునగపాక పేరుగాంచిందన్నారు. సేవ గరిడీల ద్వారా ఎంతో మంది కళా నైపుణ్యం పెంచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పెద్దలు పెంటకోట సత్యనారాయణ, ఆడారి సన్యాసిరావు, తోడపెద్దు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో వసతుల కల్పనకు కృషి



తిమ్మరాజుపేట సచివాలయం పక్కన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

మునగపాక: తిమ్మరాజుపేట గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలన్నారు. శనివారం సచివాలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను సంబంధిత వార్డు సభ్యుడు కాండ్రేగుల జగన్‌మోహన్‌రావు పర్యవేక్షించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జీఎస్టీ సవరణతో తగ్గిన వ్యవసాయ పరికరాలు

అచ్యుతాపురం: జీఎస్టీ సవరణతో రైతులకు అవసరమైన పరికరాల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలోని హరిపాలెంలో బీసీటీ ఆధ్వర్యంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడంతో పేదలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు



వరిదుబ్బును తీసుకొస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని పెరుగు బజార్ జంక్షన్ వద్ద కుంచావారి గౌరీపరమేశ్వరుల విగ్రహ నిలుపు మహోత్సవం శనివారం జరిగింది. కుంచావారి కుటుంబ సభ్యులు పట్టణంలో రఘురాం లేఅవుట్ వద్ద వరిదుబ్బును తీసుకుని వచ్చి అమ్మవారి ఆలయంలో ప్రదర్శనగా ఉంచారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రతినిధి కుంచా చిన్ని మాట్లాడుతూ ఏటా డిసెంబర్‌లో అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుంచావారి కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

6ఏ కేసు బియ్యానికి 14న వేలం

నాతవరం : మండలంలో ఇటీవల అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడి 6ఏ కింద కేసు నమోదు చేసిన బియ్యానికి ఈనెల 14న వేలం పాట నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. నాతవరం మండలం డి.యర్రవరం గ్రామంలో గల పౌరసరఫరాల గిడ్డంగి వద్ద భద్రపరిచిన బియ్యం 215 బస్తాలను కలెక్టరు జాయింట్ కలెక్టరు ఆదేశాలు అనుసరించి బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో ఆసక్తి గలవారు ముందుగా గిడ్డంగిలో గల నిల్వ చేసిన బియ్యాన్ని చూసుకోవచ్చునన్నారు. అదే విధంగా వేలం పాటు తాలూకా ఇతర వివరాలను నాతవరం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. వేలం పాటకు సంబంధించి సర్క్యులర్ మండల పరిషత్ కార్యాలయంతో పాటు సచివాలయంలో గల నోటీసులు బోర్డుల్లో ప్రదర్శించామన్నారు.

పూడిక తీత ఎప్పటికో.!

- అధ్వానంగా నేరేళ్ల కాలువ
- వర్షం పడితే రోడ్డుపై మురుగు ప్రవాహం
- మరోవైపు ఆక్రమణల బెడద



పూడికతీతకు నోచుకోని నేరేళ్ళ కాలువ



సక్రమంగా పూడికతీతకు నోచుకోని ప్రధాన డ్రైనేజీ కాలువ

పాయకరావుపేట: పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని నేరేళ్ల కాలువ పూడిక తీతకు నోచుకోకుండా అధ్వానంగా తయారైంది. మరో వైపు కాలువకు ఆక్రమణల బెడద వేధిస్తోంది. పాయకరావుపేట పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ మీదుగా పోయే మురుగునీరు నేరేళ్ళ కాలువ ద్వారా పట్టణం నుంచి బయటకు పోవలసి ఉంది. కానీ నేరేళ్ల కాలువ పూడికతీతకు నోచుకోకపోవడం కారణంగా పట్టణంలోని మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ప్రధాన డ్రైనేజీ నీరుపోవడానికి వీలు లేకుండా పోయింది. దీంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తుంది. నేరేళ్ల కాలువ ద్వారా డ్రైనేజీ నీరు పంట పొలాలకు పోవలసినప్పటికీ పూడికతీత తీయకపోవడం, కాలువ ఆక్రమణలకు గురికావడం కారణంగా పట్టణంలో డ్రైనేజీ సమస్య ఏర్పడింది. ఈ సమస్య కారణంగా లక్ష్మీ థియేటర్ వద్ద మెయిన్‌రోడ్డుపైకి మురుగునీరు వర్షం పడినప్పుడల్లా ముంచెత్తుతోంది. అదే సమయంలో కంటోన్మెంట్ ఏరియా కూడా నీట మునిగిపోతోంది. వర్షం పడితే కంటోన్మెంట్ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. పార్కు వద్ద కూడా మురుగునీరు నిలిచిపోతోంది. ఈ సమస్యపై ఈ నెల 8న జరిగిన గ్రామసభలో కంటోన్మెంట్ వాసులు ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నీటి పారుదల శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి నేరేళ్ళ కాలువ పూడికతీత పైన, ఆక్రమణలపైన దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈవోపీఆర్‌డీ డేవిడ్‌ను సంప్రదించగా డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షం పడితే ఇళ్ల మధ్యే మురుగు



నేరేళ్ల కాలువ పూడిక పోయింది. దీంతో ప్రధాన డ్రైనేజీ ద్వారా పోయే మురుగునీరు సక్రమంగా పోవడం లేదు. వర్షం పడితే ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచిపోయి కంపుకొడుతోంది. రోడ్డు పైనే మురుగునీరు ప్రవహిస్తుంది. నేరేళ్ల కాలువ, ప్రధాన డ్రైనేజీలో తక్షణం పూడికతీత తీత చేపట్టాలి.

– ఆడారి నూకరాజు, కంటోన్మెంట్ వాసి, పాయకరావుపేట

త్వరలో వైఎస్సార్‌సీపీ చలో రాజయ్యపేట



మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ

- మత్స్యకారులకు మద్దతుగా ఉద్యమం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం
- 28వ రోజుకు మత్స్యకారుల దీక్ష

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్ష 28వ రోజుకు చేరుకుంది. శనివారం ఈ దీక్షలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతుగా త్వరలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో రాజయ్యపేట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 28 రోజుల నుంచి మత్స్యకారులు ఆందోళన బాటపడితే ప్రభుత్వంలో చీమకుట్టినట్టయినా లేదన్నారు. ఈ ప్రాంతాన్ని కాలుష్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కాకినాడ జిల్లాలో టీడీపీ నాయకులు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్క్‌ను పాయకరావుపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయకపోతే మత్స్యకారుల తరపున పోరాటం చేస్తామన్నారు. త్వరలోనే జిల్లా, నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి చలో రాజయ్యపేట కార్యక్రమం నిర్వహించి మత్స్యకారులకు పార్టీ తరపున పూర్తి మద్దతు ఇస్తామన్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామన్నారు. మత్స్యకారుల డిమాండ్ మేరకు బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయడం తగదన్నారు. మత్స్యకారుల ప్రాణాలు తీసే పరిశ్రమలు అవసరం లేదన్నారు. టీడీపీ నాయకులకు ఒక న్యాయం, మత్స్యకారులకు మరో న్యాయమా అని నిలదీశారు. ఈ దీక్షలో మత్స్యకార నాయకులు మాతా గురునాథరావు, ఎరిపల్లి నాగేశు, నూకరాజు, స్వామి, సోమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీవై అధ్యక్షుడికి అనుమతి నిరాకరణ

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇచ్చేందుకు రాజయ్యపేట రావడానికి బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌కు అనుమతి లేదని సీఐ కుమారస్వామి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తమకు తెలిపారన్నారు. ఈ విషయాన్ని ఆయనకు తెలియజేశామని సీఐ తెలిపారు.

రైతుల ఆదాయ మార్గాలు పెంచడమే లక్ష్యం



పీఎండీకేవై ప్రారంభోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకిస్తున్న అధికారులు



సీతారాంపురంలో టెలీ కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు, తదితరులు

నక్కపల్లి: రైతుల ఆదాయ మార్గాలు పెంచి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెడుతోందని ఎండీవో సీతారామరాజు, మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ అన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం డీకేవై(ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన) పథకం ప్రారంభోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. నక్కపల్లి రైతు సేవా కేంద్రంలో జరిగిన ఈ టెలీకాన్ఫరెన్స్ అనంతరం వారు రైతులతో మాట్లాడారు. రైతుల ఆదాయం పెంచడానికి, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పథకం వ్యవసాయ రంగానికి ఎంతో ఊతమిస్తుందన్నారు. 36 పాత పథకాలను ఒక్కటిగా చేసి ఈ పీఎండీకేవై పథకాన్ని అమల్లోకి తెస్తున్నారన్నారు. పంటల బీమా, పీఎం కిసాన్, పీఎం పసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, సాగునీటి పథకం వంటి వాటిని ఈ కొత్త పథకం ద్వారా ఒకే గొడుగు కిందకు వస్తాయన్నారు. నీటి సమస్య తక్కువ దిగుబడి, మార్కెటింగ్ సదుపాయం కోసం రైతులకు సులభంగా చేయూత అందుతుందన్నారు. ప్రధానంగా దేశవ్యాప్తంగా 100 వెనుకబడిన జిల్లాల్లో రైతులకు రైతు ఆదాయాన్ని పెంచడం ఆధునిక సాంకేతికతను అందించడం, విత్తనాలు, రుణాలు మార్కెట్ చేయడం వంటి సేవలు అందించడమే లక్ష్యమన్నారు. నీటి సదుపాయాలు, గొడౌన్లు, రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన సంచాలకురాలు గాయత్రీ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట: ధన్‌ధాన్య సమృద్ధి యోజన పథకం ప్రారంభోత్సవాన్ని టీవీలో లైవ్ ప్రోగ్రామ్‌ను సీతారాంపురంలో తాండవ వ్యాలీ రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధి జి.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు వీక్షించారు. ఈ పథకంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు.

పిల్లలతో తల్లి అదృశ్యం



అదృశ్యమైన భూలక్ష్మి, పిల్లలు(ఫైల్)

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంపై ఆమె భర్త మరిసా వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌లో వెంకటేశ్వర్లు భార్య భూలక్ష్మి(30), కుమార్తె హేమవర్షితశ్రీ(8), కుమారుడు దశ్వర్(6)తో నివసిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 5 గంటలకు వెంకటేశ్వర్లు డ్యూటీకి వెళ్లి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇల్లు తాళం వేసి ఉండడంతో తన భార్య, పిల్లలు ఎక్కడికి వెళ్లారని ఇంటి యజమానిని అడగ్గా.. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో పుట్టింటికి వెళ్తున్నట్టు చెప్పారని ఇంటి యజమాని తెలిపాడు. అనంతరం వెంకటేశ్వర్లు అత్తింటికి ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



డీఐఈవో వినోద్‌బాబును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం సందడిగా సాగాయి. కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి మద్దిలి వినోద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. డీఐఈవో వినోద్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు. వచ్చే ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్, చక్రధర్, బి.కరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొలాల్లో ధాన్యం, నాటుకోళ్లు అపహరణ



బుచ్చెయ్యపేటలో బాధిత రైతులు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట, శింగవరంలో గుర్తు తెలియని వ్యక్తులు రైతుల ధాన్యం, నాటుకోళ్లు, మేకపోతును పట్టుకుపోయారు. శుక్రవారం రాత్రి సుంకరి, శనివాడ వారి పొలాల్లో ఉన్న పాకల వద్ద నుంచి రైతులు తమ ఇళ్లకు వచ్చేశారు. శనివారం ఉదయం రైతులు తమ పాకల వద్దకు వెళ్లి చూడగా పాకల్లో ఉంచిన ధాన్యం బస్తాలు, గంపల కింద దాచిన నాటుకోళ్లను దొంగలు పట్టుకుపోయినట్టు గుర్తించారు. బుచ్చెయ్యపేటకు చెందిన సుంకర నాగరాజువి 3 ధాన్యం బస్తాలు, 8 కోడి పుంజులు, సుంకర కొండబాబుకు చెందిన 6 ధాన్యం బస్తాలు, 6 కోడి పుంజులు, సుంకర అప్పారావు, చినబాబు, శ్రీనులకు చెందిన రెండు పుంజులు, రెండు పెట్టలను పట్టుకుపోయారు. గ్రామంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా దొంగలు ధాన్యం బస్తాలు, నాటుకోళ్లు అపహరణకు గురికావడంతో రైతులు విస్మయం చెందుతున్నారు. ఎల్.శింగవరం గ్రామానికి చెందిన రేణం రాము ఇంటి ముందు కట్టిన మేకపోతును కూడా దొంగలు పట్టుకుపోయారు. సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతులు వాపోతున్నారు.

గురునాథరావుకు ఘన నివాళి



గురునాధరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మాజీ మంత్రి, దివంగత గుడివాడ గురునాథరావు జయంతి సందర్భంగా పెంటకోట గ్రామంలో శనివారం ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, గ్రామస్తులు చేపల ప్రసాద్, గేదెల తాతబాబు, చేపల నాగేశ్వరరావు, బొంది గోపి, చేపల చిన్న, చిక్కాల యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హిందుత్వమే శ్రీరామరక్ష



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సదస్యులు యుగంధర్




హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

- ప్రాంత కార్యకారిణి సదస్యులు యుగంధర్

కశింకోట: హిందుత్వమే దేశానికి శ్రీరామ రక్ష అని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సదస్యులు జి.యుగంధర్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక అరబిందో కల్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో విజయ దశమి పర్వదినాన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఏర్పడిందన్నారు. దీన్ని పురస్కరించుకుని వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. దేశ భక్తి కలిగిన సేవా సంస్థ అని తెలిపారు. అంతా ఐక్యంగా ఉండి హిందుత్వాన్ని, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఇందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణకు మారుపేరు అని, దేశంలో ఏ విపత్తులు వచ్చినా సేవలందిస్తారన్నారు. ఆర్ఎస్ఎస్ శాఖలు గ్రామ స్థాయిల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారానికి ఒకసారైనా దీనిలో ప్రజలు పాల్గొవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తెల్ల చొక్కా, ఖాకీ ప్యాంటు, పట్టా, టోపీ, షూ ధరించి ఆకర్షణీయంగా నిలిచారు. వారు యోగాసనాలు, ఇతర విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అచ్యుతాపురం బ్రాండెక్స్ పరిశ్రమ భాగస్వామి పి.సి. దొరస్వామి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శిష్టి గోపి, సోమునాయుడు, శిష్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెతో అందని 104 సేవలు



కేజే పురం పీహెచ్‌సీ వద్ద ఉన్న 104 వాహనాలు

మాడుగుల రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు సమ్మెతో గ్రామాల్లో 104 సేవలు పూర్తి స్థాయిలో అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యాధికారులు తమ న్యాయమైన కోర్కెలు సాధన కోసం ఈ నెల 1వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీనిలో భాగంగా మండలంలో కె.జె.పురం, కింతలి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. కె.జె.పురం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు సమ్మెలో పాల్గొన్నలేదు. వారు తమ విధులును యథావిధిగా నిర్వహిస్తున్నారు. అయిన ఈ పిహెచ్‌సిలో పనిచేసే వైద్యాధికార్లు ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదు పాత్రుడు, తోపాటు డాక్టర్ సందీప్ విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ సందీప్‌ను డిప్యూటేషన్‌పై చీడిగుమ్మల పీహెచ్‌సీకి వేశారు. వైద్యులు సమ్మె వల్ల ఈ సర్దుబాటు వేసారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే ఆయుష్ వైద్యాధికారి వి. శ్రీదేవిని కింతలి పీహెచ్‌సీకి డిప్యూటేషన్ మీద వేశారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే ఇద్దరు వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. కాగా పీహెచ్‌సీల్లో ఒక్కో వైద్యాధికారి విధులు నిర్వహించడం వల్ల గ్రామాల్లో జరిగే ఫ్యామిలి ఫిజిషియన్ (104 సేవలు)కు ఆటంకం ఏర్పడింది. ప్రతి నెలలో ఏదో ఒక గ్రామంలో వైద్య సేవలు అందించాలి. వైద్యాధికారి, అయా సచివాలయం ఏఎన్ఎం, ఎంయల్‌హెచ్‌పి, కలిపి వైద్య సేవలు అందించనున్నారు. అయితే 104 వాహనాలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అయా గ్రామాల్లోకి వెళ్లి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి, మందులు అందజేస్తున్నారు. ఈ వాహనాలు వైద్యులు సమ్మె చెయ్యక ముందు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు అయా గ్రామాల్లో వైద్య సేవలు అందించే వారు. దీంతో ఇప్పుడు వైద్యుల సమ్మెతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించి వారి సమ్మెను విరమింప చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నాం



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న శేఖర్, శ్రీనివాసరావు

కె.కోటపాడు : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో వారి బోధనా సమయం హరించుకుపోతుందని అనకాపల్లి జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శేఖర్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆదేశాల మేరకు బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు తెలుపుతూ ఎంఈవో సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. బోధనేతర పనులు కాని, గూగుల్ షీట్స్‌ను పూర్తి చేయడం, జీఎస్టీ 2.0, సీజనల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించబోమని తెలిపారు. ఉపాధ్యాయులు బి.శివప్రసాద్, సూర్రెడ్డి బాబూరావు, ఐ.అశోక్‌కుమార్, బోకం ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వానంగా పేటసూదిపురం రోడ్డు



గోతుల్లో నీరు చేరి చెరువుని తలపిస్తున్న పేటసూదిపురం రోడ్డు



రోడ్డుపై గతుకుల్లో నిలిచిన వర్షపు నీరు

ఎస్.రాయవరం: పేటసూదిపురం రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న ఈ రోడ్డుకు గత ప్రభుత్వంలో రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్రాంతికి రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పి హడావుడిగా పనులు ప్రారంభించారు. గ్రామానికి ఆనుకుని శిథిలమైన సీసీ రోడ్డు పెచ్చులు తొలగించి కొత్త రోడ్డు నిర్మాణానికి పనులు మొదలు పెట్టారు. 1.2 కిలోమీటర్లు ఉన్న రోడ్డు మొదలు పెట్టి సగం మేర పూర్తి చేసి మిగిలినది వదిలేశారు. గతేడాదిలో ప్రారంభమైన రోడ్డు 10 నెలలు గడిచినా పూర్తి చేయలేదు. చెరువుగట్టు ఉన్న ప్రాంతంలో తొలగించిన సీసీ రోడ్డుపై కనీసం గ్రావెల్ కూడా వేయకపోవడంతో రోడ్డంతా గతుకులు పడి అస్తవ్యస్తంగా మారింది. ఏమాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కాంట్రాక్టర్లు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నా పట్టించుకునే నాథుడేలేరని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.